# పంచదార చిలక.... రంగుల చేట

- నేడు పాయకరావుపేటలో చిలకల తీర్థం
- పేరంటాలమ్మ గుడి వద్ద భారీ తిరనాళ్లు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పంచదార చిలకలు



రంగుల చేటలు

**నక్కపల్లి/పాయకరావుపేట:** పంచదార చిలక... రంగుల చేట... ఈ పేరు చెబితే గుర్తొచ్చేది చిలకల తీర్థం. రంగురంగుల చిలకలు, చేటల కోసం ఉగాది నాడు పాయకరావుపేటలో జరిగే చిలకల తీర్థానికి వెళ్లాల్సిందే. 50 ఏళ్లుగా పేరంటాలమ్మ ఆలయం వద్ద జరుగుతున్న ఈ చిలకల తీర్థానికి తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల నుండి భారీగా జనం హాజరవుతారు. చిలకలు, చేటలు భారీగా అమ్ముడవుతాయి. పేరంటాలమ్మ తల్లి పండగ సందర్భంగా ఈ చిలకల తీర్థం జరుగుతుంది. ఉగాది పర్వదినాన పేరంటాలమ్మతల్లి తీర్థం (చిలకలతీర్థం) అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆలయంలో ప్రతి ఏటా పేరంటాలమ్మతల్లికి మలిపెద్దివారి కుటుంబీకులు తొలిపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేస్తారు. పేరంటాలమ్మ గుడికి వచ్చిన వారు పంచదార చిలక, రంగుల చేట కొనుక్కోవడం ఆనవాయితీగా మారింది. చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకువెళ్తే నిండునూరేళ్లు పసుపు, కుంకుమలతో ముత్తైదువుగా వుంటామనేది మహిళల భావన. చేటలు, చిలకలు విక్రయాలు భారీగా జరుగుతుండడంతో కాలక్రమేణా చిలకలతీర్థంగా పేరువచ్చింది. ఈ తీర్థంలో చిలకలు, చేటలు వివిధ రంగుల్లో తయారు చేసి వివిధసైజుల్లో విక్రయిస్తారు. వాటిని ఇంటికి తీసుకువెళ్లి దేవుడు వద్ద ఉంచి పూజలు చేస్తారు. ఇటీవల కాలంలో పంచదార, వెదురు రేట్లు పెరగడంతో పాటు పనిచేసే వారికి కూలి రేట్లు ఎక్కువగా వున్నాయని తయారీదారులు చెబుతున్నారు. మార్కెట్‌లో పంచదార కిలో రూ.60 ఉంది. వెదురు ధరలు కూడా భారీగా వున్నాయి. అరకిలో చిలక రూ.60 ఉంటుంది. ముప్పావు కిలో చిలక రూ.80, కిలో చిలక రూ.100 నుంచి 120లకు విక్రయిస్తారు. రంగుల చేటలయితే రూ.50 వరకు విక్రయిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం భారీ తిరనాళ్లు జరుగుతుంది. తుని వెళ్లాలంటే వై జంక్షన్ నుంచి బైపాస్‌రోడ్డు, షుగర్‌ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులు పాయకరావుపేట పట్టణంలో నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తుని వాహనాల్లో వెళ్లడంపై ఆంక్షలు విధిస్తారు. కేవలం కాలినడకన తప్ప ద్విచక్రవాహనాల్లో వెళ్లడానికి వీలుపడదు. వాహనాల్లో వెళ్లాలంటే రాత్రి 11గంటల తర్వాతే వెళ్లాల్సి ఉంటుంది.

**భారీ బందోబస్తు....**

ఉగాదినాడు పాయకరావుపేటలో చిలకలతీర్థాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పట్టణంలో నుంచి తుని రాకపోకలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాలినడకన తప్ప వాహనాల్లో వెళ్లడానికి వీల్లేదన్నారు. వాహన చోదకులు పోలీసులకు సహకరించాలన్నారు.

## ఇంటి పన్నుల వసూలు శతశాతం పూర్తి చేయాలి

**యలమంచిలి:** గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు త్వరితగతిన చెల్లించే విధంగా పంచాయతీరాజ్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారిణి శిరీషారాణి అన్నారు. మంగళవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు శత శాతం రాబట్టాలని పంచాయతీల్లో అభివృద్ధికి ఆదాయ వనరులు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు.

## రీసర్వేను పరిశీలించిన ఆర్‌డీవో

**పాయకరావుపేట :** పెంటకోట గ్రామంలో నిర్వహించిన భూముల రీసర్వేను నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం మంగళవారం పరిశీలించారు. రీసర్వేలో పలు అంశాలను మండల తహసీల్దార్ కె.జయప్రకాష్‌ను, సర్వేయర్ పి.సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూముల రికార్డులను పరిశీలించారు.



## ఉప్పలపాటి ఫౌండేషన్ ద్వారా వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

**మునగపాక:** జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు వరంలా మారిందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ సంయుక్తంగా పేర్కొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో పథకం నిర్వహణకు అవసరమయ్యే వంటపాత్రలను ఉప్పలపాటి ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సమకూర్చిన విషయం తెలిసిందే. మంగళవారం సంబంధిత నిర్వాహకులకు వాటిని అందజేశారు. ఎంఈవో వేణుగోపాలరావు, హెచ్‌ఎం సూర్యనారాయణ, పీఎంసీ చైర్మన్ ఆడారి సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ గణేష్, పార్టీ అధికార ప్రతినిధి కాశీబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడాతో చిన్నారులకు ఆరోగ్యం

**కోటవురట్ల:** చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సీతారామరాజు అన్నారు. కోటవురట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సీతారామరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో రక్తహీనతను తరిమేయ వచ్చన్నారు. చిన్న తనం నుంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇవ్వడం ద్వారా చిన్నారుల్లో కంటి సమస్యలు కూడా రావన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ వి.రాంబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## భావనారుషేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు

**రాంబిల్లి:** కొత్తపేటలో శ్రీ భద్రావతి సమేత భావనారుషేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు బుధ, గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కల్యాణ మహోత్సవాల కమిటీ ప్రతినిధి మాడెం రాజుబాబు తెలిపారు. బుధవారం శూలాల మహోత్సవం, గురువారం కల్యాణ మహోత్సవం , అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## రాయితీపై చిరుధాన్యాల పంపిణీ

**మునగపాక:** రైతులకు రాయితీపై చిరుధాన్యాలను అందజేస్తామని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దాసు పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు పేటకట్టు ప్రాంతంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. చోడిలో చైతన్య రకం వినియోగించాలన్నారు. రాగి, కొర్రలు, సజ్జలు సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**మునగపాక:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీటీసీ శరగడం అప్పలనర్సమ్మ, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్‌తో కలిసి ప్రారంభించారు. ఆధార్ కేంద్రంలో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ నేత రామభద్రనాయుడు పాల్గొన్నారు.

## ఆలయాల్లో పంచాంగ పఠనం

**నక్కపల్లి:** ఉగాది సందర్భంగా ఉపమాకలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రముఖ విశ్రాంత తెలుగు పండిట్ ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్‌వేదాల గాయత్రిదేవి ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం జరుగుతుంది. వేంపాడు సత్యసాయి మందిరం, చినదొడ్డిగల్లులో శ్రీరామ పంచాయతన ఆలయం, పాయకరావుపేటలో పాండురంగ స్వామి ఆలయం, ఎస్.రాయవరం మండలం దార్లపూడి వేంకటేశ్వరస్వామి ఆలయం, కొరుప్రోలు సీతారామస్వామి ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు జరుగుతాయి.

## 12వ పీఆర్సీ వేయాలి

**కోటవురట్ల:** 11వ పీఆర్సీ ముగుస్తున్న కారణంగా వెంటనే జాప్యం చేయకుండా 12వ పీఆర్సీని వేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యూటీఎఫ్ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ, పీఎఫ్, జీపీఎఫ్, డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# ఘనంగా కొత్త అమావాస్య పండగ



తిమ్మాపురంలో నూకాంబిక అమ్మవారు



కైలాసపట్నంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు, జెడ్పీటీసీ



అమ్మవారి గరగలకు పసుపు కుంకుమలు సమర్పించుకుంటున్న భక్తులు



వేప చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

**ఎస్.రాయవరం:** గ్రామాల్లో కొత్త అమవాస్య వేడుకను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. చినగుమ్ములూరు, తిమ్మాపురం, పెదగుమ్ములూరు గ్రామాల్లో ఇలవేల్పుగా కొలిచే ఈ అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా జరిపారు. వేకువజాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు, చీర సారెలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

**కోటవురట్ల:** మండలంలో కొత్త అమావాస్య పండగను మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయాల వద్ద భక్తుల తాకిడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూకాంబిక అమ్మవారిని కైలాసపట్నంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, సిద్దాబత్తుల సత్యనారాయణ, నాగేశ్వరరావు, తంగేడులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, కె.వెంకటాపురంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్ దర్శించుకున్నారు. రామచంద్రపురంలో చంటి, చిన్న, నూకరాజు, అప్పలనాయుడు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

**నక్కపల్లి:** కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ ఆలయాలు భక్తులతోకిటకిటలాడాయి. నక్కపల్లి, వేంపాడు, దేవవరం, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో కొత్త అమావాస్య సందర్భంగా నూకాలతల్లి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ గ్రామాల్లో పదిరోజుల పాటు అమ్మవారి ఘటాలను గ్రామాల్లో ఊరేగించారు. రేలారే, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు. సర్పంచ్‌లు సురేష్ వర్మ, వెంకటేష్, ఆనందరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

**రాంబిల్లి:** కొత్త అమావాస్య సందర్భంగా రాజుకోడూరు, దిమిలి, కొప్పుగొండుపాలెం, వెల్చూరు తదితర గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. రాజుకోడూరులో నూకాంబిక అమ్మవారిని జెడ్పీటీసీ నాగరాజు దంపతులు దర్శించుకొని పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

**యలమంచిలి:** కొత్త అమావాస్య సందర్భంగా మంగళవారం నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం స్థానిక నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మొక్కులు చెల్లించుకున్నారు.

**పాయకరావుపేట:** కొత్త అమావాస్య సందర్భంగా నూకాంబిక ఆలయాలు భక్తులతో కిటకిటలాడినవి. గ్రామాల్లో గరగలు ప్రతి ఇంటికి వెళ్ళి పూజలు అందుకున్నవి. వీధుల్లో గరగలు ఆటలు పలువురు భక్తుల్ని ఆకట్టుకున్నవి.


**అచ్యుతాపురం(అనకాపల్లి):** అచ్యుతాపురం మండలంలో కొండకర్ల నూకాంబిక-ఎల్లారమ్మ పేరాంటాల మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. కొత్త అమావాస్య పండుగను మండలంలోని పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

# జగనన్న గోరుముద్ద మరింత రుచికరం


పాఠశాలల్లో రాగిజావ పంపిణీ



చినగుమ్ములూరులో రాగి జావ పంపిణీ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి



నాగులాపల్లిలో విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న వైస్ ఎంపీపీ దేవి,సర్పంచ్ చిన్నమ్మలు



కైలాసపట్నంలో రాగిజావను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు

**నక్కపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల కోసం జగనన్న ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వీసం రామకృష్ణ, ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. మంగళవారం పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. నక్కపల్లి, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో నాడు నేడు పథకం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరుతో నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. తాజాగా మంచి పోషక విలువలతో కూడిన రాగి జావను అందించడం గొప్ప విషయమన్నారు.

**కోటవురట్ల:** జగనన్న గోరుముద్దకు మరిన్ని రుచులు, పోషకాలు కలిశాయని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని ఎంపీపీ స్కూల్‌లో జగన్న గోరుముద్ద పథకంలో కొత్త చేరిన రాగి జావ పంపిణీ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ పిల్లకు రాగి జావను పంచి, తాను రుచి చూశారు. ఇది ఎంతో బలవర్ధకమైన ఆహారమని పిల్లలు విధిగా జావను తాగేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, పార్టీ నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, సర్పంచ్ నూకరత్నం, ఎంఈవో అప్పారావు, హెచ్‌ఎం లచ్చబాబు పాల్గొన్నారు.

**మునగపాక:** విద్యార్థుల్లో రక్తహీనత లోపం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రాగిజావ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని వైస్ ఎంపీపీ చిందాడ దేవి అన్నారు. నాగులాపల్లిలో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన రాగిజావ కార్యక్రమాన్ని ఆమె సర్పంచ్ జామి చినమ్మలుతో కలిసి ప్రారంభించారు. అన్ని పాఠశాలల్లో ఈ పథకం అమలవుతుందని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు.

**పాయకరావుపేట:** ప్రతి విద్యార్థి మంచి ఆరోగ్యంతో ఉండాలన్న ధ్యేయంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేశారని, ఇందులో భాగంగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ ఎంతో మంచి కార్యక్రమం అని జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అన్నారు. విద్యార్థులకు మంగళవారం రాగి జావ పంపిణీ ప్రారంభించారు. పెంటకోట గ్రామంలో జెడ్పీ విద్యార్థులకు చిక్కాల రామారావు రాగిజావ పంపిణీ చేసి ప్రారంభించారు.

**ఎస్.రాయవరం:** పాఠశాలల్లో జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు రాగిమాల్ట్ ఇవ్వడం వారి ఆరోగ్యానికి మంచి పరిణామం అని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. చినగుమ్ములూరు, ఎస్.రాయవరం గ్రామాల్లో జెడ్పీటీసీ విద్యార్థులకు మంగళవారం రాగిజావ అందించారు. పి.ధర్మవరం, వమ్మవరం,తిమ్మాపురం, పెద గుమ్ములూరు, దార్లపూడి గ్రామాల్లో విద్యార్థులకు రాగి జావ అందించారు.

**యలమంచిలి:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు సంపూర్ణమైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తోందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మంగళవారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**అచ్యుతాపురం(అనకాపల్లి):** అచ్యుతాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగా జావ పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా ప్రజా ప్రతినిధులు, పాఠశాల కమిటీ చైర్మన్‌ల సమక్షంలో విద్యార్థులకు రాగి జావ అందజేశారు.

**రాంబిల్లి :** రాగి జావతో విద్యార్థులకు కాల్షియం, పోషక విలువలు పెంపొంది సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు అన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.